## పిడుగు పడి మూడు గేదెలు మృతి

కందుకూరు, మే 18 : పిడుగు పాటుకు మూడు పాడి గేదెలు మృతి చెందాయి. మండల పరిధిలోని రాచులూరు గ్రామానికి చెందిన నల్ల కళమ్మ తన వ్యవసాయ పొలం వద్ద పాడి గేదెలను చెట్టుకు కట్టేసి ఉంచారు. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు ,ఈదురు గాలులతో వచ్చిన వర్షానికి పిడుగు పడడంతో మూడు గేదెలు మృతి చెందాయి. దీంతో కళమ్మ మృతి చెందిన గేదెలను చూసి లబోదిబోమన్నారు. గేదెలపై ఆధారపడి ఉన్న తనకు ఉన్న ఫలంగా పాడి గేదెలు మృతి చెందడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు విచారం వ్యక్తం చేశారు.

## వివాహిత అదృశ్యం

**జవహర్‌నగర్, మే 18:** అరుంధతినగర్‌లో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన శివకుమార్ నిషాద్, భార్య రాధికాదేవితో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 17న శివకుమార్ నిషాద్ పనికోసం బయటకు వెళ్ళగా... రాధికదేవి(22) ఇంటి నుంచి వెళ్ళిపోయి తిరిగిరాలేదు. ఆమెకు ఫోన్ చేయగా స్పందించలేదు. సొంత గ్రామం గోరఖ్‌పూర్‌లోని బంధువులకు ఫోన్ చేయగా అక్కడికి రాలేదని తెలిపారు. దీంతో రాధికాదేవి ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అగ్నిప్రమాదంలో 17 మంది మృతి బాధాకరం

చిక్కడపల్లి, మే 18: చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో జరిగి న అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం అనుసరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

# ఆలయాల అభివృద్ధి పట్టని కాంగ్రెస్..

లింగమయ్య గుట్టపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పూజలు..లక్ష్మీ నగర్ కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ



లింగమయ్య గుట్టపైకి కాలినడకన వస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, మే 18: మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నాదర్‌గూల్‌లో ఉన్న లింగమయ్య గుట్టపై ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాలినడకన గుట్టపైకి చేరుకుని స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దేవాలయాల అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న లింగమయ్య గుట్టలో పరమేశ్వరుడు కొలువై ఉన్నారన్నారు. అనంతరం స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్ రెడ్డి, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ నరసింహారెడ్డి, పెద్ద బావి ఆనంద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యాదయ్య, ఏనుగు రాంరెడ్డి, జంగయ్య, తదితరులు ఉన్నారు.

## దశలవారీగా సమస్యలు పరిష్కారం



బీఆర్‌ఎస్ నేత ప్రమోద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, మే 18: మహేశ్వరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె.. లక్ష్మీ నగర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో సమస్యలను అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె.. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ నాయకుడు, బీఆర్‌ఎస్ నాయకుడు ప్రమోద్ కొటార్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు ఫ్రాక్చర్ కావడంతో పరామర్శించి.. వివరాలు తెలుసుకున్నారు. పరామర్శించినవారిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్కల కామేశ్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, ఏనుగు రామి రెడ్డి, బల్వంత్, సోషల్ మీడియా కన్వీనర్ సిల్వర్ సాంబ శివ, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కాలనీ అధ్యక్షు అరుణ్, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి మల్లేశ్, తదితరులు ఉన్నారు.



సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న బండ్లగూడ కాలనీవాసులు

## సమస్యలు పరిష్కరించాలి

### బండ్లగూడ కాలనీవాసుల ర్యాలీ, ఆందోళన

మన్సురాబాద్, మే 18: సమస్యల పరిష్కారం కోసం నాగోల్ డివిజన్, బండ్లగూడ గ్రామ ప్రజలు రోడ్డెక్కారు. నెలల తరబడిగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలతో పలు కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆందోళన చేశారు. బండ్లగూడ చౌరస్తా నుంచి ఆనంద్ నగర్ చౌరస్తా వరకు ఆదివారం బండ్లగూడవాసులు ర్యాలీ నిర్వహించి.. తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. యూజీడీ, మంచినీటి పైపులైన్ల లీకేజీల సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్లను మార్చి రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన లైన్లను ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ పరిష్కారం లభించడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని బండ్లగూడ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్టు రవీందర్ గౌడ్, తూర్పాటి ధనరాజ్, సత్యానారాయణ గౌడ్, పంగా శ్యామ్, రాఘవేందర్ గౌడ్, సహదేవ్, నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి



జైస్వాల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మే 18: సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీలు, బస్తీల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సీసీ కెమెరాలు నేరాలను నిరోధిస్తాయని, కెమెరాల ద్వారా మరింత భద్రత ఏర్పడుతుందన్నారు. అంబర్ పేట నియోజకవర్గాన్ని నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. వాడ వాడలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అన్నారు. డివిజన్లలో సీసీకెమెరాల ఏర్పాటుకు ముఖ్యంగా మహిళలు, యువకులు, చొరవ చూపాలన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఏరియాల్లో నేర సంఘటనలు తక్కువగా ఉంటాయని, ఒక వేళ జరిగిన వెంటనే తెలుసుకోవచ్చునన్నారు. ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఏరియాల్లో 24గంటలు ప్రజలకు రక్షణలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జైస్వాల్ గార్డెన్ రెసిడెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం గౌడ్, స్వామి గౌడ్, జి.ప్రసన్నాంజనేయులు,ఏ.రామాగౌడ్ ,సి.యాదవరెడ్డి, సీహెచ్ ఇంద్రసేనా యాదవ్, డ్, పి.శ్రీహరి చారి, , జి.సురేందర్, , బి.మధుసూదనచారి, కె.అశోక్ కు మార్, కె.ఈశ్వరయ్య, పి.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం కార్యవర్గం





ఐవీఎఫ్ నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేస్తున్న జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా

మన్సురాబాద్, మే 18: అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గంలోని పలు విభాగాలకు నూతన కార్యవర్గాన్ని ఆదివారం సాయంత్రం ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రకటించారు. ఐవీఎఫ్ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్‌పర్సన్‌గా ములుగు శ్రీలత, కోఆర్డినేటర్ గా పద్మజ, పీఆర్‌ఓగా స్వాతి, సలహాదారులుగా ఏపూరి రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా వావిలాల వినోద, లలిత, కార్యవర్గ సభ్యురాలిగా నాగమణి, సేవాదళ్ చైర్ పర్సన్‌గా గోలి శ్రీలత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా సంయుక్త, ప్రధాన కార్యదర్శిగా అనూష, కోశాధికారిగా శ్వేత, పీఆర్‌ఓగా సాయి సర్గీ, పొలిటికల్ చైర్ పర్సన్‌గా సత్యకళ, అదనపు ప్రధాన కార్యదర్శిగా లావణ్య, సేవాదళ్ కమిటీ చైర్ పర్సన్‌గా మాధురి, చంద్రపురినగర్ డివిజన్ అధ్యక్షురాలి గా శ్రీలత, కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా ఉషారాణి, డివిజన్ అధ్యక్షురాలిగా ఉమ, ప్రధాన కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా అన్నపూర్ణ నియమితులయ్యారు. నూతనంగా నియమింపబడిన కార్యవర్గానికి ఉప్పల శ్రీనివాస్ గుప్తా నియామక పత్రాలను అందజేశారు.

## వైభవంగా అమ్మవారి విగ్రహాల పునఃప్రతిష్ఠ



కందుకూరు, మే 18 : కందుకూరు మండలం, పులిమామిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఆదివారం బొడ్రాయి, నాభిశిల, ఎల్లమ్మ దేవి, గజ ధ్వజస్తంభం, పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో అనేగౌని దామోదర్ గౌడ్, అనే గౌని పాండు గౌడ్, బుక్క వెంకట్ రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, శ్రీనివాస్, సాలయ్య, మంగలి మల్లయ్య, పాపగల్ల రాములు, మంగలి చంద్రపాల్, వెంకటేశ్, పాపగల మహేశ్, అల్వాల శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం





పేద విశ్వకర్మ విద్యార్థి లింగన్నపేట సాయి సందీప్ కు శ్రీ విరాట్ విశ్వకర్మ సేవా సమితి ఆర్థిక సహాయం అందజేశారు. దిల్‌సుఖ్‌నగర్, పీ & టీ కాలనీవాసి సందీప్ 10 పరీక్షల్లో 569 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీ విరాట్ విశ్వకర్మ సేవా సమితి ఆ విద్యార్థిని అభినందించి.. రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించింది. కార్యక్రమములో శ్రీ విరాట్ విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షుడు కీర్తిగారి అనంతచారి, ప్రధాన కార్యదర్శి శ్రీరామదాసు గోవర్ధన్ చారి, కోశాధికారి రవి చారి, సభ్యులు నర్సింహా చారి, చెన్నోజు శ్రీనివాస్, సత్యం, శీను, తదితరులు పాల్గొన్నారు. *– ఎల్‌బీనగర్, మే 18*

## అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్ నగర్ ,మే18: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమ స్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నాయని ఆరోపించారు. ప్రభు త్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనాలు కార్మికులకు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

## ఆలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం :ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, మే 17:** ఆలయాల్లో మౌలిక వసతులు కనిపిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్‌లోని కాశీ విశ్వనాథ ఆలయంలో ఆదివారం రాజగోపురం శిఖర ప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ ఆలయం ఏర్పడి 100 ఏండ్లు అవుతున్న సందర్భంగా రాజగోపురాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షధారణం, యాగశాల ప్రవేశం దేవత ఆహ్వానం అగ్ని ప్రతిష్ఠ గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాజగోపురం ప్రతిష్ఠ దాతలు రవీంద్ర దత్త, రంజిత, జి.అనిల్ కుమార్ రోజా వేముల సతీ సమేత నవగ్రహ ప్రతిష్ఠ దాతలు గంట ప్రవీణ్, ఆలయ అధ్యక్షులు బీఎం రాజా రాం, జీఎం రమేష్, ఏ.రాజు, సత్యనారాయణ, కృష్ణ, గణేష్, విజయ్ కుమార్, సువ ర్ణ, లక్ష్మి, శివకుమార్, మహేశ్వరి, మీనా, ఉమాదేవి, జగదీష్, వేదవత్, నవీన్, స్నేహ, భావన, ప్రణతి, ప్రశాంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఫీజుల నియంత్రణపై రౌండ్ టేబుల్ సమావేశం

అడ్డగుట్ట, మే 18: ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా తీసుకుంటున్న ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అరకొర వసతులను కల్పిస్తూ ఫీజుల విషయంలో మాత్రం కచ్చితంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై నిఘా అవసరమని, ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని పలు సర్వేల్లో ఇప్పటికే వెల్లడైందని వారు పేర్కొన్నారు. చాలా వరకు ప్రైవేట్ పాఠశాలలు రెట్టింపు ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులపై పెను భారాన్ని మోపుతున్నాయని అన్నారు.

## యువతకు స్ఫూర్తి మారోజు వీరన్న



జవహర్‌నగర్, మే 18: బహుజనుల హక్కుల కోసం ఉద్యమించిన మారోజువీరన్న పోరాట పటిమ యువతకు స్ఫూర్తిదయాకమని జవహర్‌నగర్ విశ్వబ్రహ్మణ సంఘం జేఏసీ అధ్యక్షుడు మా రోజు సోమాచారిఅన్నారు. కార్పొరేషన్‌లోని విశ్వబ్రహ్మణ సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మారోజు వీరన్న వర్థంతిని పురస్కరించుకొని ఆదివారం వీరన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమాచారి మాట్లాడుతూ మారోజు వీరన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాషపల్లి రమేష్‌చారి, రమేష్‌బాబు, యాకస్వామి, పరశురామ్, రామదాసు, సదానందచారి, దయాకర్‌చారి, గాలయ్య, పుల్లయ్య, ఆంజనేయులు, సత్యంచారి, సూర్యచారి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రభాగ పుస్తక పరిచయ సభ

రవీంద్రభారతి, మే18 : తెలంగాణ సాహి త్య అకాడమీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సాహిత్య వారం కార్యక్రమంలో డా.నామో జు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహి త్య అకాడమీ అధ్యక్షతన ప్రముఖ కథా రచయిత, అనువాదకులు డా.రూప్‌కుమార్ డబ్బీకార్ అనువదించిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతల కథల అనువాద సంకలనం చంద్రభాగ పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ విమర్శకులు ఆచార్య టి. గౌరీ శంకర్ పుస్తక పరిచయం చేస్తూ కథల్లోని సామాజిక, వైయుక్తిక, రాజకీయ వైరుధ్యాలు ఏ విధంగా వ్యవస్థలపను, మనిషిని సంఘర్షణకు గురిచేస్తున్నాయని వివరించారు. విమర్శకులు సి.ఎస్. రాంబా బు మాట్లాడుతూ.. కథల ఎన్నిక, వస్తువు గురించి అనువాదాల్లోని వ్యాక్యాలు చాలా చోట్ల కవితాత్మకంగా ఉంటూ పాఠకున్ని కట్టిపడేస్తాయి. డా. నామోజు బాలాచారి మాట్లాడుతూ.. అతెలంగాణ సాహిత్య గ్రంథాల ప్రచురణ బాధ్యతలను తీసుకోవడమే గాక ఆ గ్రంథాలను సాహిత్య రంగానికి పరిచయం చేస్తూ కవులకు, రచయితలకు సహకరిస్తుందని చెప్పారు. ఈ దిశగానే చంద్రభాగ ప్రచురించిందని చెప్పారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం వెలవెల..!

### ఒకవైపు వర్ష భయం.. మరోవైపు తేమ శాతం

### పొలాల వద్దే ప్రైవేటు వ్యాపారులకు విక్రయం..

కందుకూరు, మే 18: రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తుంది. ఒకవైపు వాన గుబులు.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు.. అన్న దాతలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మద్దతు ధర దేవుడెరుగు.. ధాన్యం విక్రయిస్తే చాలు అనుకుంటున్నారు. విధిలేక తక్కువ ధరకు అయినా పర్వాలేదని దళారులకు అమ్ముకుంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యాపారులు నేరుగా కల్లాల వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో కేంద్రాలు వెలవెలబోతున్నాయి. రైతులు వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారులవైపే మొగ్గు చూపుతున్నారు. మండల కేంద్రంలో గత నెల 28న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. 8000 క్వింటాళ్ల వరి ధాన్యం వస్తుందని అంచనా వేయగా ఇప్పటివరకు కేవలం 250 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. రూ.500 బోనస్ కోసం చూస్తే తేమ శాతం 17 ఉండాలి. దానికోసం ధాన్యం ఆరబెట్టాలి... దాన్యం ఆరబెడితే క్వింటాకు ఆరు నుంచి ఏడు కిలోల వరకు బరువు తగ్గుతుంది. అలాగే .. ఆకాల వర్షాల భయం, డబ్బుల కోసం వేచి ఉండడం, తదితర కారణాలతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. లాభం, నష్టం, చూసుకోకుండా కొంతమంది రైతులు క్వింటాల్‌కు రూ.1900 నుంచి రూ.2 వేల వరకు అమ్ముకుంటున్నారు.



కందుకూర్‌లో వెలవెలబోతున్న కొనుగోలు కేంద్రం

### కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు..



కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు ముందుకురావడం లేదు. గత నెల 28న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే తాము ఎనిమిది వేల క్వింటాళ్ల వడ్లు వస్తాయని అంచనా వేయగా .. నేటి వరకు కేవలం 250 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. రైతులకు తరుగుతో పాటు వర్ష భయం వెంటాడుతుంది. తాము పెట్టిన పెట్టుబడి వస్తుందో లేదో అని ఎక్కడో ఒకచోట అమ్ముకుంటున్నారు. దీంతో కేంద్రానికి రావాల్సిన వడ్లు రావడం లేదు

*– దేవరశెట్టి చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్, కందుకూర్*



## సన్మానం..

మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడిగా బాబు శ్రీనివాస్ రెండవసారి ఎన్నికైన సందర్భంగా ఓల్డ్ మలక్‌పేటలో ఆయనను సన్మానించారు ఈ సందర్భంగా బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ.. దళితుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌకి రవి కుమార్, చీపిరి రాజారావు గౌడ్, మొహమ్మద్ గౌస్, గడ్డం నరేందర్, విజయ్ కుమార్, రాజేశ్, మోహన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

*– మలక్‌పేట*

## హరిపురి కాలనీలో పడకేసిన పారిశుధ్యం ..!



హరిపురి కాలనీలో డ్రైనేజీ నీరు..

ఆర్కేపురం, మే 18: ఆర్కేపురం డివిజన్, హరిపురి కాలనీలో పారిశుధ్యం పడకేసింది. రోడ్ నంబర్– 3లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వర్షం పడిన ప్రతిసారి ఈ సమస్య ఎదురవుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. పూడికతీత పనులు చేపట్టకపోవడం మూలంగానే వరదనీరు సాఫీగా ముందుకు సాగకపోవడంతో డ్రైనేజీ పొంగి పొర్లుతుందన్నారు. దీంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాల మూలంగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, నాలాలో పూడికతీత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మొక్కుబడిగా అప్పుడప్పుడు పూడికతీత పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. పూడికతీత పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు నిధులను దుర్వినియోగం చేసి పనులు చేపట్టడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు నాలా పూడికతీత పనులు చేపట్టి మురుగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## చలం రచనలకు స్త్రీయే వెన్నెముక



రవీంద్రభారతి, మే18 : చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికి చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల యొక్క సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చునని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా కెఎన్ మల్లీశ్వరి, నెల్లుట్ల రమాదేవి, డా.సలీమా, డా. లక్ష్మీఅసిరెడ్డి, డా. దాసోజు పద్మావతి, డా. శ్రీభాష్యం అనూరాధ,సభా అధ్యక్షుడుగా తెలంగాణ రచయితల సంఘం కన్వీనర్ నాళేశ్వరం శంకరం తదితరులు విచ్చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చలం మొత్తం రచనలకు వెన్నెముఖ స్త్రీ వ్యాససంపుటాలే, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్త్రీ పురుష సమానత్వాన్ని ఏ ఆధిపత్యాలు లేని జీవితం స్త్రీ గడపాలని ఆకాక్షించారు. ఈ కార్యకరమం లో పలువురు చలం అభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public hereby informed that My client VEERAMALLA RAVI S/o. VEERAMALLA KESHAVULU, Aged about 44 Years, Occ: Business, R/o. Karmanghat, Saroornagar, Hyderabad has entered into an Agreement of sale with SANJEEV KUMAR PANCHAL S/o. SRI NAGMURTHI PANCHAL R/o. Jampad, Bidar, Karnataka state In respect of the property of the Land bearing Plot No: 612, in Survey Nos. 78 & 81 to 85, Admg. 200 Sq. Yards or equivalent to 167.23 Sq. Mtrs. Situated at Nadergul Village, Balapur Mandal, Ranga Reddy District. TG and also paid considerable amount as an ADVANCE in respect of the above said property. If any person or persons having any right, title, interest or claim over the said property or otherwise by way of any prior agreement of sale with the above said owner, may contact the undersigned within (7) seven days from the date of paper publication of this notice or else No claim will be entertained thereafter and my client will proceed to get registered a sale deed of the above said property.

Sd/- **D. PICHI REDDY**
Advocate
Office: Plot No: 9/10, Road No.4, Pindinarayana Reddy Colony, Phase-II, Biramalguda, L.B.Nagar, Hyderabad. TG.
**Mobile No: 93469 28300**